క్లుప్తంగా

వైఎస్సార్ సీపీకి ప్రజలు పట్టం కట్టాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): కులమతాలు రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు, సంక్షేమం అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి పట్టం కట్టాలని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అల్లుడు మంచుకొండ చక్రవర్తి కోరారు. స్థానిక 30వ డివిజన్ దేవీనగర్, గద్దే వెంకట్రామయ్య నగర్ ట్రెండ్ సెట్‌లో బుధవారం స్థానిక కార్పొరేటర్ బి.జానారెడ్డి, మాజీ డెప్యూటీ మేయర్ గోగుల రమణారావుతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరిస్తూ, ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు మంచి చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని నిండుమనసుతో ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వెలంపల్లి సోదరుడు రామకృష్ణ, 30వ డివిజన్ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కార్యకర్తలు, వెలంపల్లి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

క్రైస్తవులకు ప్రత్యేక మేనిఫెస్టో రూపొందించాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాబోయే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు క్రైస్తవులకు ప్రత్యేక మేనిఫెస్టో రూపొందించాలని నేషనల్ క్రిస్టియన్ బోర్డు జాతీయ అధ్యక్షుడు జాన్ మస్కు కోరారు. విజయవాడ గవర్నర్‌పేటలోని ఓ హోటల్‌లో తెలుగు రాష్ట్రాల పాస్టర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. క్రైస్తవుల హక్కుల సాధన కోసం వారికి చట్టసభల్లో సముచిత స్థానం కల్పించాలని అన్ని పార్టీలను కోరారు. ఏ ప్రభుత్వం అధికారం చేపట్టినా క్రైస్తవులకు రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో తమకు సరైన ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షుడు నవీన్ కుమార్ బత్తుల, కార్యదర్శి డేవిడ్ మార్క్, ఉపాధ్యక్షులు అమృత రావు, పీటర్, జాషువా చింతయ్య, బర్నబాస్ తదితరులు పాల్గొన్నారు.

ఈఎన్‌టీ వైద్యుల సంఘం నూతన కమిటీ ఎన్నిక



డాక్టర్ దేవినేని ప్రదీప్, అధ్యక్షుడు



డాక్టర్ కేఎస్ భార్గవ్, ప్రధాన కార్యదర్శి

లబ్బీపేట(విజయవాడతూర్పు): భారతీయ ఈఎన్‌టీ వైద్యుల సంఘం విజయవాడ శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విజయవాడ గవర్నర్‌పేటలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో బుధవారం జరిగిన సమావేశంలో 2024 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా డాక్టర్ దేవినేని ప్రదీప్, ఉపాధ్యక్షునిగా డాక్టర్ ఆర్.పవన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ భార్గవ్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ తన్వీర్ అఫ్రోజ్, కోశాధికారి డాక్టర్ కె.వినీషాలను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా వైద్యులు పి.సుధ, అనూష, గోపీనాయక్, కె.స్పందనలను నియమించారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

పెనమలూరు: యనమలకుదురులో వ్యక్తిపై పలువురు వ్యక్తులు దాడి చేయటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన పెదపూడి మనోజ్ కుమార్ కానూరులో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. అతను గ్రామంలో కొండ వెనుక ఉన్న నాయుడు టీ షాపు వద్దకు టీ తాగటానికి వెళ్లాడు. అక్కడ టీ కొట్టు యజమానితో ఇద్దరు వ్యక్తులు తగాదా పడుతుంటే వారిని మనోజ్‌కుమార్ నివారించాడు. కాగా ఇంట్లో సరుకులు తీసుకురావటానికి మనోజ్‌కుమార్ రాత్రి కిరాణా షాపు వద్దకు రాగా శివపార్వతినగర్‌కు చెందిన ఎం.మహేష్, జి.కిశోర్, జయ, సాయిరామ్, సిద్దిక్ ఆటోలో వచ్చి అకారణంగా మనోజ్‌కుమార్ పై దాడి చేశారు. ఈ ఘటనలో మనోజ్‌కుమార్‌కు గాయాలయ్యాయి. టీ షాపు వద్ద గొడవ నివారించినందుకే తనపై దాడి చేశారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

సీఎం జగన్ చొరవతో నెరవేరిన చిరకాల కోరిక

- ఇళ్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియతో న్యూ ఆర్ఆర్‌పేట వాసుల ఆనందం
- వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే వెలంపల్లి
- 57వ డివిజన్‌లో అధికారులతో కలిసి క్షేత్ర స్థాయి పర్యటన
- 'గడప గడపకు మన వెలంపల్లి' కార్యక్రమం



రైల్వే లైన్ ప్లాన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, తహసీల్దార్ శేఖర్‌బాబు, అధికారులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 57వ డివిజన్ న్యూరాజరాజేశ్వరిపేట ప్రాంత ప్రజల చిరకాల కోరికైన ఇళ్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పూర్తి చేసిన గొప్ప ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. కార్పొరేషన్, రెవెన్యూ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి 57వ డివిజన్‌లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ.. , నిరుపేద ప్రజలు జీవిస్తున్న న్యూఆర్ఆర్‌పేట, వాంబే కాలనీ వంటి ప్రాంతాల్లో అసలైన అభివృద్ధిని చేసి చూపిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్నారు. న్యూరాజరాజేశ్వరీపేట ప్రాంతంలో స్థానిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, వాటర్ పైపులైన్ లీక్‌లు, వీధి దీపాలు, సైడ్ డ్రెయిన్ల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులు ఆదేశించామన్నారు. సుబ్బరాజు నగర్, అరుణోదయనగర్ ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ సమస్యలను కూడా రోజుల వ్యవధిలోనే పరిష్కరిస్తామని చెప్పారు. సుబ్బరాజు నగర్, అరుణోదయ నగర్ ప్రాంతంలో రైల్వే సంబంధిత స్థలాల నేపథ్యంలో రైల్వే అధికారులతో సమావేశం నిర్వహించి స్థానిక ప్రజలకు నష్టం జరగకుండా చూస్తామన్నారు. ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ల కోసం చంద్రబాబు ఎప్పుడు పూనుకోలేదని, ఎన్నికల ముందు పనికిరాని జీఓను తీసుకువచ్చి నాడు ప్రజలను టీడీపీ మోసం చేసిందని గుర్తుచేశారు. సెంట్రల్ నియోజకవర్గంలో సుమారు 20 వేలు మందికి ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించామని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, ఇళ్ల పట్టాలు లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. నార్త్ జోన్ తహసీల్దార్ శేఖర్‌బాబు, కార్పొరేటర్ ఇసరపు దేవి, కార్పొరేషన్ ఈఈ శ్రీనివాస్, ఇతర అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కుప్పంలోనూ విజయం తథ్యం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రజలంతా వైఎస్సార్ సీపీని మరోసారి అధికారంలోకి తీసుకురావాలనే ఆశతో ఉన్నారని, కుప్పంతో సహా అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ అఖండ మెజార్టీలతో అన్ని నియోజకవర్గాల్లో విజయం సాధిస్తుందని ఎమ్మెల్యే వెలంపల్లి ధీమా వ్యక్తంచేశారు. గడప గడపకు మన వెలంపల్లి కార్యక్రమం స్థానిక 57వ డివిజన్‌లో బుధవారం సాయంత్రం జరిగింది. దీనిలో పాల్గొన్న ఆయన న్యూరాజరాజేశ్వరి పేట పరిసర ప్రాంతాల్లో పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. వాటిలో కొన్నింటిని సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, కార్పొరేటర్ ఇసరపు దేవి, నాయకులు మల్లెల చెన్నకేశవరెడ్డి, ఇసరపు రాజు, కాళ్ల ఆదినారాయణ, బాల, పఠాన్ నజీర్‌ఖాన్, చెన్నారెడ్డి, శ్రీనివాసరెడ్డి, ప్రేమ్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రంలో దేవాలయాలకు పునర్వైభవం

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే విష్ణు



కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే విష్ణు, నాయకులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): హిందూ ధర్మ పరిరక్షణకు, వైదిక ధర్మాన్ని కాపాడుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. సత్యనారాయణపురంలోని శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో రూ.70 లక్షల సీజీఎఫ్(కామన్ గుడ్ ఫండ్)తో నిర్మించిన నూతన భవనాన్ని స్థానిక కార్పొరేటర్ శర్వాణి మూర్తితో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ.. కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానానికి 90 ఏళ్ల ఘన చరిత్ర ఉందన్నారు. ఇంతటి ప్రాశస్త్యం కలిగిన ఆలయ అభివృద్ధిని గత పాలకులు పూర్తిగా విస్మరించారని గుర్తుచేశారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పురాతన, శిథిలావస్థకు చేరుకున్న ఆలయాలకు సీజీఎఫ్ ఫండ్‌తో పునర్వైభవం తీసుకువస్తున్నామని తెలిపారు.

దాతలకు సన్మానం..

కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రూ.70 లక్షల నిధులు కేటాయించడం ఆలయ చరిత్రలో తొలిసారని విష్ణు చెప్పారు. అదే విధంగా రూ.95 లక్షలతో గవర్నర్‌పేటలోని శ్రీ కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానం, రూ.18 లక్షలతో తుమ్మలపల్లి కళాక్షేత్రం వెనుకనున్న శ్రీ వీరబాబుస్వామి ఆలయాన్ని ఆధునికీకరిస్తామన్నారు. దేవాలయాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దైవబలం తోడైందన్నారు. హిందూ ధర్మాన్ని కాపాడుతూ, దేవాలయాల వ్యవస్థను ఎల్లవేళలా పరిరక్షిస్తూ ముందుకు సాగుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ముక్కంటి దేవతల ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ నిర్మాణానికి నిధులు ఇచ్చిన దాతలను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించి, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కె.సుపద్మాదేవి, ఆలయ చైర్మన్ కొల్లూరు రామకృష్ణ, ధర్మకర్తల మండలి సభ్యులు, నాయకులు దోనేపూడి శ్రీనివాస్, కనపర్తి కొండా, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే పీడీ యాక్ట్ అమలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీసీపీ కృష్ణకాంత్ పటేల్

కృష్ణలంక(విజయవాడతూర్పు): నిబంధనలు అతిక్రమించి అసాంఘిక, సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని డీసీపీ కృష్ణకాంత్ పటేల్ హెచ్చరించారు. సీపీ కాంతిరాణా టాటా ఆదేశాల మేరకు బుధవారం కృష్ణలంక పోలీస్ స్టేషన్ ఆవరణంలో సౌత్ డివిజన్ పరిధిలోని కృష్ణలంక, గవర్నర్‌పేట, సూర్యారావుపేట పోలీస్ స్టేషన్లకు సంబంధించిన గంజాయి బ్యాచ్, బ్లేడ్ బ్యాచ్, యాక్టివ్ రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ కృష్ణకాంత్ పటేల్ మాట్లాడుతూ.. గంజాయి సేవించినా, అమ్మినా, సరఫరా చేసినా అటువంటి వారిపై కేసు నమోదు చేయడమే కాకుండా నగర బహిష్కరణకు వెనుకాడబోమన్నారు. గంజాయి మత్తులో నేరాలు చేసే వారిపై ప్రత్యేక నిఘా పెట్టామని చెప్పారు. చిన్న పిల్లలు, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే పోక్సో చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కళ్ల ముందు చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సౌత్ డివిజన్ ఏసీపీ రత్నరాజు, కృష్ణలంక, గవర్నర్‌పేట, సూర్యారావుపేట సీఐలు ఏ.మురళీకృష్ణ, దుర్గారావు, డి.వి.రమణ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ఆదరించటం సామాజిక బాధ్యత



వీల్‌చైర్లు అందజేసిన ఎమ్మెల్యే మల్లాది విష్ణు, నిర్వాహకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దివ్యాంగులను ఆదరించటం సామాజిక బాధ్యత అని, కండరాల క్షీణితపై అవగాహన పెంచుకోవాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక బీఆర్టీఎస్ రోడ్డు ఫుడ్ జంక్షన్ వద్ద బుధవారం వరల్డ్ రేర్ డిసీజ్ డే సందర్భంగా అమరావతి రేర్ డిసీజ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మస్క్యులర్ డిస్ట్రోఫీ వ్యాధిపై అవగాహన ర్యాలీ జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తమ ప్రభుత్వం దివ్యాంగులకు అండగా నిలుస్తుందన్నారు. అమరావతి రేర్ డిసీజ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు సుంకర శోభారాణి మాట్లాడుతూ.. మస్క్యులర్ డిస్ట్రోఫీలో రకాలు ఉన్నాయని, దీనిని గుర్తించి, ప్రజల్లో అవగాహన కలిగించడం కోసం ఈ ర్యాలీ నిర్వహించామన్నారు. అనంతరం 10 మంది కండరాల క్షీణత వ్యాధిగ్రస్తులకు వీల్ చైర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అమరావతి రేర్ డిసీజ్ ఆర్గనైజేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సైన్స్ సబ్జెక్ట్‌లో విద్యార్థులు రాణించాలి



పాయకాపురం(విజయవాడరూరల్): సైన్స్ సబ్జెక్ట్‌లో ప్రతి విద్యార్థి రాణించాలని ఎన్టీఆర్ జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని వాంబేకాలనీ రవీంద్రభారతి హైస్కూల్‌లో బుధవారం విద్యార్థులు సైన్స్ ఎక్స్‌పోను నిర్వహించారు. ఈ సందర్భంగా మైనం హుస్సేన్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఎప్పటికప్పుడు నూతన ఆవిష్కరణలను తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం సైన్స్ ఎక్స్ పోలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్ నందు విద్యార్థులు జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని 300 మంది విద్యార్థులు నూతన ఆవిష్కరణలను తయారు చేసి ప్రదర్శించారు. జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే వేడుకలు



మాట్లాడుతున్న అసోసియేషన్ కార్యదర్శి అనిల్‌కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నవ్యాంధ్ర విజయవాడ టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 36వ టైలర్స్ డే వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. హనుమంతరాయ గ్రంథాలయంలో జరిగిన ఈ వేడుకలకు అసోసియేషన్ సెక్రటరీ పిల్లి అనిల్‌కుమార్ అధ్యక్షతన కార్యక్రమంలో తొలుత అసోసియేషన్ ప్రతినిధులు కుట్టు మిషన్ ఆవిష్కర్త హోవే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పిల్లి అనిల్ కుమార్ మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏటా టైలర్స్ ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ రావూరి సుబ్బారావు (దత్తా) మాట్లాడుతూ హోవే ఆవిష్కరించిన కుట్టు మిషన్ నేడు ఎందరికో ఉపాధి కల్పిస్తోందన్నారు. సమాజానికి టైలర్లు అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సిల్వెస్టర్ మిమిక్రీ ప్రదర్శన, లావణ్య బృందం భరత నాట్య ప్రదర్శన, కేవీ భాస్కర్ బృందం హాస్య వల్లరి సభికులను అలరింపజేసింది. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ సలహాదారు కొండేటి కృష్ణ, స్టీరింగ్ కమిటీ చైర్మన్ కూరపాటి రాఘవరాజు, ప్రెసిడెంట్ జె.డి. కళ్యాణ్, వైస్ ప్రెసిడెంట్ ఎండీ షఫీవుల్లా, జాయింట్ సెక్రటరీ షేక్ అస్లాం, కోశాధికారి జె.దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సీఐగా పెద్దిరాజు బాధ్యతల స్వీకరణ

గన్నవరం: గన్నవరం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా వాసా పెద్దిరాజు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ట్రాఫిక్ సీఐ సూర్యనారాయణరావును మచిలీపట్నం డీసీఆర్‌బీకి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో డీసీఆర్‌బీ సీఐ వాసా పెద్దిరాజును ఉన్నతాధికారుల బదిలీ చేశారు. ఈ మేరకు ట్రాఫిక్ స్టేషన్‌లో పెద్దిరాజు బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో పెనమలూరు పీఎస్, సీఐడీ, డీసీఆర్‌బీ విభాగాల్లో సీఐగా పనిచేశారు. పెద్దిరాజును ట్రాఫిక్ అధికారులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

సృజనాత్మకతకు సైన్స్ ఎక్స్‌పోలు దోహదం



విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విష్ణు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచడంలో సైన్స్ ఎక్స్‌పోలు దోహదం చేస్తాయని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. స్థానిక సత్యనారాయణపురంలోని నెల్లూరు రవీంద్ర భారతి స్కూల్‌లో బుధవారం సైన్స్ ఎక్స్‌పో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వివిధ నమూనాలతో ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠశాలలో పాఠాలతో పాటుగా అనేక రంగాల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శర్వాణిమూర్తి, సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ సునీత, అడ్వకేట్ రామకృష్ణ, పాఠశాల జీఎం శివారెడ్డి, ఏజీఎం కేశవరాజు, డీన్ శ్రీకాంత్, ప్రిన్సిపాల్ మీనాక్షి శైలజ తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మద్యం అక్రమంగా విక్రయిస్తున్న యువకుడిని కొత్తపేట పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సెక్టార్ ఎస్ఐ దేవసుధ బుధవారం తెల్లవారుజామున ఎర్రకట్ట, పాత రాజరాజేశ్వరి పేట ప్రాంతాల్లో గస్తీ నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించగా ఎస్ఐ దేవసుధ విచారించారు. పాత రాజరాజేశ్వరి పేటకు చెందిన షేక్.ఖాజాగా గుర్తించి అతని వద్ద ఉన్న సంచిని పరిశీలించారు. అందులో 9 మద్యం బాటిల్స్, 9 బీర్ బాటిల్స్‌ను గుర్తించారు. నిందితుడిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

రిటైనింగ్ వాల్ పార్క్ పనులు త్వరగా పూర్తి చేయండి



పార్క్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పెంచే రిటైనింగ్ వాల్ పార్క్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులకు ఆదేశించారు. ఆయన నగర పర్యటనలో భాగంగా కృష్ణానది ఫేస్–2 రిటైనింగ్ వాల్ వెంబడి కనకదుర్గ వారధి నుంచి పోలీస్ కాలనీ డీపీ స్టేషన్ వరకు నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ పార్కును బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పేపర్ బ్లాక్ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో అవసరమైతే బ్యాచులను పెంచి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పాత్వేను పరిశీలించి మలుపులు అత్యంత సుందరంగా ఉండాలన్నారు. ప్రత్యేక మొక్కలను ఏర్పాటు చేసి గ్రీనరీ వర్క్ వెంటనే మొదలు పెట్టాలని అదేశించారు. కమిషనర్ వెంట అడిషనల్ కమిషనర్(జనరల్) ఎ.మహేష్, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు, డెప్యూటీ ఇంజినీర్ పార్క్స్ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

నేడు పోరంకిలో మినీ జాబ్‌మేళా

పెనమలూరు: పోరంకిలో మినీ జాబ్ మేళాను గురువారం నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన బుధవారం ప్రకటనలో వివరాలు తెలుపుతూ జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించటానికి ఉపాధ కల్పన శాఖ సహకారంతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. పోరంకి శ్రీనివాసానగర్‌లోని హ్యాపీ మైండ్స్ ట్రైనింగ్ సెంటర్‌లో గురువారం ఉదయం 9.30 గంటల నుంచి జాబ్‌మేళా ఉంటుందన్నారు. పలు ప్రముఖ కంపెనీల నుంచి ప్రతినిధులు హాజవుతారని అన్నారు. ఇంటర్ నుంచి పీజీ వరకు చదువుకున్న యువత జాబ్‌మేళాకు రావాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 12 వేల నుంచి రూ. 20 వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు బయోడేటా, ఆధార్, సర్టిఫికెట్లతో రావాలని, మరిన్ని వివరాలకు 9666615539లో సంప్రదించాలని సూచించారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



విజేతలతో ఎస్ఆర్ఆర్ ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి



సైన్స్ ప్రదర్శనలను పరిశీలిస్తున్న ఏసీపీ ప్రసాద్



విద్యార్థులు రూపొందించిన అమ్మఒడి ప్రదర్శన

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని, ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా ఎదగాలని ఏసీపీ డీఎస్‌వీ ప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక సత్యనారాయణపురం రవీంద్రభారతి పాఠశాలలో బుధవారం సైన్స్ ఎక్స్ పోను నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి పాఠశాల చైర్మన్ వీరమాచినేని వంశీతో కలిసి సైన్స్ ఎక్స్ పోను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, పాఠశాల స్థాయి నుంచే నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. పాఠశాల అకడమిక్ డైరెక్టర్ వీరమాచినేని శాంతి, వి.రమేష్, కె.రాజేష్, ప్రిన్సిపాల్ నిమ్మగడ్డ హెప్సీబా, వి.దీప, ఏ.రాము, శశిరేఖ, ఎస్.ఆదినాగలక్ష్మి మాట్లాడారు. విద్యార్థులు రూపొందించిన వ్యవసాయ పద్ధతులు, చంద్రయాన్, అమ్మ ఒడి, సర్వమత సమ్మేళనం తదితర ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఉత్తమ ప్రదర్శన చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఎస్‌టీవీఆర్ పాఠశాలలో..

దుర్గాపురం ఎస్‌టీవీఆర్ నగరపాలకసంస్థ పాఠశాలలో బుధవారం బీఆర్‌టీఎస్ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యాన సైన్స్ పితామహుడు సర్ సీవీరామన్ జయంతి పురస్కరించుకుని ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ డెప్యూటీ గవర్నర్ డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు జి.ఏడుకొండలు, కె.రాము, పి.రమేష్, బాలాజీ, పి.విల్సన్ పాఠశాల హెచ్‌ఎం సూర్యప్రభ, సైన్స్ టీచర్ ఎస్‌వీ శ్యాంప్రభు తదితరులు పాల్గొన్నారు.

మధురానగర్‌లో..

మధురానగర్ రవీంద్రభారతి పాఠశాలలో బుధవారం విజ్ఞాన ప్రదర్శన జరిగింది. విద్యార్థులు వారిలోని సృజనాత్మతకను చాటేలా ప్రదర్శనలు రూపొందించారు. కార్యక్రమాలను ఎం.పద్మ పర్యవేక్షించారు.

గురుకుల కళాశాలలో వైజ్ఞానిక దినోత్సవం

మధురానగర్(విజయవాడసెంట్రల్): సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో బుధవారం జాతీయ వైజ్ఞానిక దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ అధ్యాపకులతో కలిసి సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైజ్ఞానిక దినోత్సవం పురస్కరించుకుని 'నిత్య జీవితంలో విజ్ఞానశాస్త్రం' అనే అంశంపై అతిథి ఉపన్యాసం జరిగింది. ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతికశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ జె.నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నిత్యజీవితంలో మనకు ఉపయోగపడుతున్న ప్రతి వస్తువుకూ ఆధారమైన విజ్ఞాన శాస్త్రాలను విద్యార్థులు అధ్యయనం చేయాలన్నారు. ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకొని ఉత్తమ బోధనతో భావి శాస్త్రవేత్తలను దేశానికి అందించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో....

మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం వైజ్ఞానిక దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు పోస్టర్, క్విజ్, సెమినార్‌లను నిర్వహించారు. పోటీల్లో విజేతలకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి బహుమతులు అందజేశారు.